క్లుప్తంగా

కుర్చీల వితరణ



వితరణగా ఇచ్చిన కుర్చీలతో మధుసూదన్‌రావు

కొడవలూరు: స్థానిక ఎంఈఓ కార్యాలయానికి రిటైర్డ్ హెచ్‌ఎం డేగా మధుసూదన్‌రావు కుర్చీలను వితరణగా ఇచ్చారు. ఈ కార్యాలయంలో తగిన కుర్చీల సదుపాయం లేకపోవడంతో మండలంలోని గుండాలమ్మపాళేనికి చెందిన మధుసూదన్‌రావు రూ.50 వేల విలువైన 50 కుర్చీలను బుధవారం వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య అభినందించారు.

గీతాంజలిలో వర్క్‌షాప్

కోవూరు : మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ పి.నాగేంద్రకుమార్, ఐఐసీసీ విభాగాధిపతి డాక్టర్ పి.చక్రపాణి, సమన్వయకర్తలు ఎం.శివనాగమణి, ఆర్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యభిచార గృహంపై దర్గామిట్ట పోలీసులు దాడి చేశారు. వివరాలు.. ముత్తుకూరుకు చెందిన ప్రభుదాస్ కొంతకాలం క్రితం టెక్కేమిట్ట రైల్వేట్రాక్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. బెంగళూరు, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై నరేష్ తన సిబ్బందితో కలిసి ఫ్లాట్‌పై మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. నిర్వాహకుడితో పాటు ఆకుతోట వడ్డిపాళేనికి చెందిన వెంకటేష్, వెంకటాచలం మండలానికి చెందిన రాజ్‌ప్రమీల్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను హోమ్‌కు తరలించారు.

16 వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు ఈ నెల 16 వరకు కోర్టు విధులను బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మెజార్టీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. న్యాయవాదులు సహకరించాలని కోరారు.

'డీకేడబ్ల్యూ'లో శిక్షణ నేడు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల ప్రిన్సిపల్స్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లకు శిక్షణను నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో గురువారం నిర్వహించనున్నామని ఆర్‌ఐఓ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా డీఆర్వో లవన్న హాజరుకానున్నారని చెప్పారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు రూ.ఎనిమిది వేల నుంచి రూ.పది వేల చొప్పున రూ.5.12 లక్షల మేర స్కాలర్‌షిప్‌లను మలబార్ గోల్డ్ యాజమాన్యం అందజేయనుందని ఆర్‌ఐఓ తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం పది గంటలకు నిర్వహించనున్నారని వివరించారు.

ప్రాణాలు కాపాడి న్యాయం చేయాలి

నెల్లూరు(మినీబైపాస్): మూలాపేటకు చెందిన ఎంసీఏ చదివిన కొత్తపల్లి కీర్తికి నగరంలోని ఓ వైద్యశాల నిర్దేశించిన మందులు వికటించాయని, ప్రాణాలు కాపాడి న్యాయం చేయాలని తల్లి నీరజ కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆమె మాట్లాడారు. శరీరంపై దద్దుర్లు రావడంతో నగరంలోని ఓ హోమియో క్లినిక్‌కు తీసుకెళ్లగా, వారు ఇచ్చిన మందులు వికటించాయని చెప్పారు. చెన్నైలోని ఓ ఆస్పత్రిలో ఐసీయూలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోందని వాపోయారు.

'గణేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలి'

నెల్లూరు (వేదాయపాళెం): ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేశ్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఘటనను తీవ్రంగా ఖండించారు.

చెంతకే ప్రభుత్వం.. లబ్ధిదారుల సంతోషం



కరోనా సమయంలో వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీనివాసులు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

- ఆదర్శవంతంగా వలంటీర్ల సేవలు

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా చెంతకే ప్రభుత్వ సేవలు అందుతోంది. గత ప్రభుత్వంలో లబ్ధిదారులు సంక్షేమ పథకాలు, పింఛన్లకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందుతోంది. దీంతో లబ్ధిదారులు సంతోషంగా పథకాలను తీసుకుంటూ నిశ్చింతగా జీవిస్తున్నారు.

కరోనా కాలంలో..

కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు నిరంతర సేవలు అందించారు. పొదలకూరు కాలనీలో వేలిముద్రలు లేకుండా ఫొటోలు తీసి ధైర్యంగా పింఛన్లను అందజేశారు. అనేక ఇళ్లకు నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు.

వృద్ధులకు ఠంచన్‌గా పింఛన్

ఒకటో తేదీ వస్తే వృద్ధులకు ఠంచన్‌గా పింఛన్ అందుతోంది. వలంటీర్లు ఉదయాన్ని తలుపు తట్టి పింఛన్ అందజేస్తున్నారు. మండల కేంద్రం పొదలకూరు టీచర్స్ కాలనీలో యనమల ఓబులమ్మకు వలంటీర్ పి.సుధాకర్ వృద్ధాప్య పింఛను అందజేశారు. ఓబులమ్మ నడవలేని స్థితిలో మంచంలో ఉండగా వలంటీరు వెళ్లి ఆమెకు పింఛన్ పంపిణీ చేశారు.

చిత్తశుద్ధితో..

భర్తను కోల్పోయి, గుండెకు శస్త్రచికిత్స చేసుకుని ఇబ్బందుల్లో ఉన్న మహిళకు చివరిరోజు రాత్రి నెల్లూరు నారాయణ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసి వలంటీర్ తన చిత్తశుద్ధిని ప్రదర్శించాడు. పొదలకూరు సచివాలయం బిట్-3 పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ ఆర్.వంశీ చల్లా నారాయణమ్మకు పింఛన్ ప్రతినెలా అందజేస్తారు. అయితే ఆమె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకుంది. సమాచారం తెలుసుకున్న వంశీ ఆమె శస్త్రచికిత్స చేయించుకున్న ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసి వలంటీర్‌గా విధి నిర్వహణలో తన చిత్తశుద్ధిని చాటుకున్నాడు.



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వంశీ

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, ఇక్కడ ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులను కూడా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, డాక్టర్ ఖాదర్‌వలీ, కౌన్సిలర్లు షకీల, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష శిబిరంలో చైర్‌పర్సన్ సుప్రజ, కౌన్సిలర్లు

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ బోల్తా పడి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో బుధవారం జరిగింది. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మోహన్‌కృష్ణ పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి బుచ్చిరెడ్డిపాళెం వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి పడింది. ఈ ప్రమాదంలో మోహన్‌కృష్ణకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సింగిల్ విండో క్యాంప్ 12కు వాయిదా

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 9వ తేదీన నిర్వహించాల్సిన తల్లీబిడ్డలకు ఆధార్, జీరో అకౌంట్ బ్యాంక్ ఖాతాల క్యాంప్‌ను ఈనెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సింగిల్‌విండో క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

గ్యాస్ లీకై ఎగసిన మంటలు

పొదలకూరు : పట్టణంలోని కేఆర్ నగర్ సమీపంలో ఓ భవన నిర్మాణానికి వచ్చిన కూలీలు బుధవారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. ఎలాంటి ప్రమాదం సంభవించకుండా మంటలను ఆర్పివేశారు. గ్యాస్ పైపు నాణ్యతా లోపం వల్ల మంటలు వచ్చినట్లు గుర్తించి కూలీలకు గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అభినందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి ట్రాక్ సూట్లు అందజేస్తున్న వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి అభినందించారు. వీఎస్‌యూ విద్యార్థులు వి.ప్రవీణ్, కె.విష్ణు గణేష్, సుబ్రహ్మణ్యం, ఎస్.నరసింహులు, లతీష్‌కుమార్, రవికుమార్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి బుధవారం ట్రాక్ సూట్లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపి వీఎస్‌యూకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సునీత, వై.రవీంద్రమ్మ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

కోవూరు : మండలంలోని పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయంలో రికార్డులను ఆన్‌లైన్ చేస్తున్న క్రమంలో సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు పూర్తిగా సహకరించాలని ఆ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న సొసైటీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు తమ ఆధార్, పొలానికి సంబంధించిన జెరాక్స్ కాపీలు, పాస్ కార్డు జెరాక్స్ కాపీలను ఐదు రోజుల్లోగా అందజేయాలన్నారు. సొసైటీకి సంబంధించి ఇప్పటివరకు బంగారంపై రూ.7 కోట్ల మేర రుణాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా సొసైటీ ప్రాంగణంలో ఈనెల 15వ తేదీన 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాము నిర్మాణ పనులను ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బుధవారం ఆదేశాలు వచ్చినట్లు తెలియజేశారు. రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్, సొసైటీ డైరెక్టర్లు జనార్దన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి

మనుబోలు తహసీల్దార్‌గా చిరంజీవి



బాధ్యతలు చేపట్టిన చిరంజీవి



శివకృష్ణయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

మనుబోలు : మనుబోలు తహసీల్దార్‌గా కె.చిరంజీవి మండల కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఉన్న శివకృష్ణయ్య బదిలీపై వెళ్లగా ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న చిరంజీవి మనుబోలుకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

శివకృష్ణయ్యకు సన్మానం

పొదలకూరుకు బదిలీ అయిన శివకృష్ణయ్యను రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానికులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు.

పారదర్శకంగా జల్‌జీవన్ మిషన్ పనులు

కోవూరు : మండల పరిధిలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో పొదుపు గ్రూపుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్‌ల కింద జల్‌జీవన్ మిషన్ పనులను పారదర్శకంగా చేపట్టేలా తగిన ప్రణాళికలు రూపొందించినట్లు జల్‌జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ లవకుమార్ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర సమావేశ మందిరంలో జల్‌జీవన్ మిషన్ పనులకు సంబంధించి పొదుపు లీడర్లు, వీఓఏలతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందించాలన్నదే జల్‌జీవన్ మిషన్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పనులకు సంబంధించి ప్రతి గ్రూపులో 11 మంది సభ్యులుగా ఉంటారని, అందులో తొమ్మిది మంది పొదుపు సభ్యులు కాగా, ఒకరు ఇంజినీరింగ్ అసిస్టెంట్, మరొకరు పంచాయతీ కార్యదర్శి ఉంటారన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఏపీఎం వెంకట స్వామి పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు రాము, సౌరీ, వసంత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జల్‌జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ లవకుమార్

పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



అభినందన పత్రం అందజేస్తున్న డైట్ ప్రిన్సిపల్ రమేష్, సర్పంచ్ సుధాకర్

ఇందుకూరుపేట : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ అన్నారు. నెల్లూరు కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక క్యాంపులో భాగంగా మండలంలోని పల్లిపాడు గ్రామంలో వారం రోజుల పాటు జరిగిన క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా డైట్ కళాశాల ప్రిన్సిపల్ పాల్గొని, మాట్లాడారు. గాంధీ ఆశ్రమం, డైట్ కళాశాల, శివాలయం తదితర ప్రాంతాలతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ నిర్వాహకులకు స్థానిక సర్పంచ్ సుధాకర్ అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ హరికృష్ణ, ఎంపీటీసీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

ముత్తుకూరు : ముత్తుకూరులో బుధవారం దట్టమైన పొగమంచు కురిసింది. రోడ్లు, వీధులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. డిసెంబర్ నుంచి జనవరి వరకు కానరాని పొగమంచు వేసవి ప్రారంభంలో ప్రత్యక్షమైంది. తెల్లవారుజాము నుంచి 8 గంటల వరకు అలుముకున్న పొగమంచుతో రోడ్లు కనిపించక వాహనదారులు లైట్ల వెలుగులో ప్రయాణం చేయాల్సి వచ్చింది.



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కమ్మేసిన పొగమంచు

రైతు ఫిర్యాదుపై డీఎస్పీ విచారణ

విడవలూరు: మండలంలోని అలగానిపాడు గ్రామానికి చెందిన నన్నం భాస్కర్ అనే రైతు ఫిర్యాదుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి బుధవారం విచారణ జరిపారు. పోలీసుల కథనం మేరకు.. గత నెల 7వ తేదీన అలగానిపాడుకు చెందిన భాస్కర్‌తో చెరువు నీటి విషయమై వరిణి గ్రామానికి చెందిన కొందరు రైతులతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కులం పేరుతో దూషించారని భాస్కర్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ వీరాంజనేయరెడ్డి అలగానిపాడు రైతులను విచారించారు. ఆయన వెంట సీఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ బి.మస్తానయ్య ఉన్నారు.



డీవార్మింగ్ మాత్రలు వినియోగించాలి

కొడవలూరు: ప్రతి విద్యార్థి నులి పురుగుల నివారణ(డీవార్మింగ్) మాత్రలు వినియోగించేలా పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని 96 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 7,654 మంది విద్యార్థులకు అవసరమైన నులి పురుగుల నివారణ మాత్రలను హెచ్‌ఎంలకు ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదికోసారి ఈ మాత్రలు ఉపయోగించడం వల్ల మలబద్ధకం లాంటి సమస్యలు తలెత్తవన్నారు. నులి పురుగులుండడం వల్ల అనీమియా సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. 2 నుంచి 19 ఏళ్ల వయస్సున్న పిల్లలు వీటిని వాడడం వల్ల ఆరోగ్యకరంగా ఎదిగేందుకు దోహదపడుతాయని చెప్పారు. ప్రభుత్వం మండలానికి 8,022 మాత్రలు సరఫరా చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నులి పురుగులతో ఆరోగ్య సమస్యలు

ఇందుకూరుపేట : నులి పురుగులతో పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందని, వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వర నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఎంపీడీఓ ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల తొమ్మిదిన ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర నాయక్, హెల్త్ ఎడ్యుకేషన్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కోవూరు : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ కార్యక్రమంపై వైద్యారోగ్య, ఐసీడీఎస్ అధికారులతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లలోపు వారికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పక వేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మాత్రలు పిల్లల్లో రక్తహీనత నివారణకు ఉపయోగపడుతుందన్నారు. ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ కోవూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులి పురుగుల నివారణ మాత్రలను వేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ రహీమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్నలక్ష్మి, పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్‌ఎస్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: పోస్టర్లను ఆవిష్కరించిన అధికారులు



కొడవలూరు : హెచ్‌ఎంలకు నులి పురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ



కోవూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు